క్లుప్తంగా

నేడు నాయనిచెరువులో గడపకు గడపకు..

చిత్తూరు రూరల్: మండలంలోని నాయనిచెరువు పంచాయతీలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాఘవేంద్రవర్మ తెలిపారు. ఉదయం 6.30 గంటలకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు గడపకు గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభించి, ఇంటింటికి వెళ్లనున్నారన్నారు. అధికారులు, సచివాలయ సిబ్బంది విధిగా హాజరు కావాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

పిల్లలకు వ్యాక్సిన్ తప్పనిసరి



నాగవాండ్లపల్లెలో పిల్లలకు వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

ఐరాల: పిల్లలకు నిర్దేశిత సమయాల్లో తప్పకుండా వ్యాక్సిన్ వేయించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో చిన్నారులకు వ్యాక్సిన్లు వేశారు. పోలియో, చికెన్ ఫాక్స్, తట్టు, కలరా, పచ్చకామెర్లు తదితరు వ్యాధులు రాకుండా ఉచితంగా వ్యాక్సిన్లు వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ ఏఎన్‌ఎం, షాహీనా, ఆశా కార్యకర్త సునీత పాల్గొన్నారు.

ఈ-కేవైసీ తప్పనిసరి

ఐరాల: పీఎం కిసాన్ పథకం వర్తించాలంటే రైతులు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఏఓ వరలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ప్రతి రైతూ ఈ నెల 15వ తేదీలోగా ఈకేవైసీ నమోదు చేసుకోవాలన్నారు.

స్కానింగ్ సెంటర్ల తనిఖీ

చిత్తూరు రూరల్: నగరంలోని పలు స్కానింగ్ సెంటర్లలో బుధవారం డీఐఓ రవిరాజు తనిఖీలు చేశారు. స్కానింగ్ మిషన్లు, రికార్డులను నిశితంగా పరిశీలించారు. రెన్యూవల్ చేయనివారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ అసిస్టెంట్ల సంఘం నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులతో పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఓలు

యాదమరి: సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ల సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవమైంది. బుధవారం సాయంత్రం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఓలు జయచంద్రారెడ్డి, నవీన్ అధ్యక్షత న నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా కాశిరా ళ్ల సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ వెంకటేశ్, కార్యదర్శిగా యాదమరి సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ప్రశాంత్‌కుమార్, కోశాధి కారిగా 14 కండ్రిగ ముస్లింవాడ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ రాజరాజన్ ఎన్నికయ్యారు.

పరిశ్రమకు కేటాయించిన స్థలం పరిశీలన

గంగాధరనెల్లూరు: శ్రీరంగరాజపురం మండలం 49 కొత్తపల్లెమిట్ట వద్ద హెర్బల్ ఎక్స్టాస్టన్ పరిశ్రమ కోసం కేటాయించిన స్థలాన్ని జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 4.18 ఎకరాల్లో పరిశ్రమ ఏర్పాటు కానుందని, స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ లోకనాథం, ఆర్ఐ త్యాగరాజులు, మండల సర్వేయర్ మురళి, వీఆర్ఓ శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

19న చేపల చెరువుల వేలం

గంగాధరనెల్లూరు: జీడీనెల్లూరు పంచాయతీ ఇరగమరెడ్డికండ్రిగలోని ఈఆర్‌కండిగ చెరువు, ఈఆర్‌కండిగ జంగమ చెరువుల్లో చేపల పెంపకం కోసం ఈనెల 19వ తేదీ వేలం వేయనున్నట్లు ఎంపీడీఓ శ్రీదేవి తెలిపారు. అలాగే కోటాగరం పంచాయతీలోని అల్లికుంట, సర్కార్ పెద్దచెరువు, బసివిరెడ్డికుంట, బసివిరెడ్డి ఒడ్డు, మరపురెడ్డికుంట, అంకిరెడ్డిఒడ్డు, బాలిరెడ్డిపెద్ద చెరువు సర్వే నంబర్ 5, బాలిరెడ్డి పెద్దచెరువు సర్వేనంబరు 54, మంచినీళ్లకుంట, చిన్నకొండయ్యకోట చెరువుల్లో చేపల పెంపకం కోసం ఈ నెల 18వ తేదీ వేలం వేస్తామన్నారు.

గొర్రెల పెంపకంపై అవగాహన

పలమనేరు: పట్టణ సమీపంలోని పశువులు, గొర్రెల పరిశోధన కేంద్రంలో బుధవారం గొర్రెల పెంపకంపై రైతులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఇందులో అన్నమయ్య జిల్లా తూముకుంట గ్రామానికి చెందిన గొర్రెల రైతులు పాల్గొన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన పరిశోధన సంచాలకులు డాక్టర్ సర్దన్‌రావు, విస్తరణ సంచాలకులు డాక్టర్ వెంకటనాయుడు, సుజాత గొర్రెలకు సోకే వ్యాధులు, నివారణ చర్యలు, పోషణ తదితరాలపై వివరించారు.

సంక్షేమ పథకాలు బంపర్ హిట్

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



పెద్దిశెట్టిపల్లె పంచాయతీలో సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం అమలు చేసిన సంక్షేమ పథకాలు బంపర్ హిట్ అయ్యాయని, దీంతో ప్రజలు ఆయన్ని ఆదరిస్తున్నారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. చిత్తూరు మండలం పెద్దిశెట్టిపల్లె పంచాయతీలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి గడపకూ వెళ్లి సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. బుక్‌లెట్‌ను అందజేస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయంలో ఇమడాలంటే ప్రధానంగా ప్రజల మద్దతు అవసరమన్నారు. ఇందులో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఓ బ్రాండ్‌ను సంపాదించుకున్నారని చెప్పారు. నవరత్నాలంటూ తెరపైకి వచ్చిన సంక్షేమ కార్యక్రమాలన్నీ కూడా పేద ప్రజల అభివృద్ధి కోసమేనని చెప్పారు. పథకాల అమలు విషయంలో ఎక్కడ లోటు లేకుండా పక్కాగా అమలు చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎన్ని కూటములు వచ్చినా వైఎస్సార్ సీపీని కదలించలేవన్నారు. రాబోయే ఎన్నికల్లో కచ్చితంగా వైఎస్సార్ సీపీ గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలంతా వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారని గుర్తు చేశారు. గడప గడపలో వచ్చిన సమస్యలను తక్షణం పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పెద్దిశెట్టిపల్లె సచివాలయంలో అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి, ఆయన పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఎంఎస్ బాబునాయుడు, సర్పంచ్ ధనలక్ష్మి, వైస్ ఎంపీపీ రంజని, జయరాం, నాయకులు త్యాగరాజులు, అమరనాథ్‌రెడ్డి, జయపాల్, మునిరత్నం, రమణ, వెంకటేష్, రామూర్తి, నంద, బాబు, కుమార్, రాజు, మనోహర్, రెడ్డెప్ప, రాజేంద్ర, చరణ్, వాసు పాల్గొన్నారు.

సీఎం చేతుల మీదుగా పీఆర్‌టీయూ డైరీ ఆవిష్కరణ



పీఆర్‌టీయూ డైరీని ఆవిష్కరిస్తున్న సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్: ప్రొగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ నూతన సంవత్సరం డైరీని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరింపజేశామని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గిరి ప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం తాడేపల్లిలో సీఎంను కలిసినట్లు వెల్లడించారు. టీచర్ల డీఏ, హెచ్‌ఆర్‌ఏ, బదిలీలు, పలు అంశాలపై చర్చించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కల్పలత, ఏపీ ఉద్యోగుల ఫెడరేషన్ చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డి పాల్గొన్నట్లు వెల్లడించారు.

ఇకపై ఈ- ఆఫీసులోనే అన్ని దస్త్రాలు

చిత్తూరు అర్బన్: నగర పాలక కార్యాలయంలో ఇకపై అన్ని విభాగాల్లోనూ ఈ -ఆఫీస్ విధానం అమలు చేయాలని నగర కమిషనర్ జె అరుణ అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం నగర పాలక కార్యాలయంలో ఈ-ఆఫీస్, ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు విధానం, స్పందన అర్జీల పరిష్కారంపై విభాగాధిపతులు, సెక్షన్ ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ అరుణ మాట్లాడుతూ నగరపాలక పరిధిలోని రెవెన్యూ, ఇంజినీరింగ్, పబ్లిక్ హెల్త్, ప్లానింగ్, అకౌంట్స్, ప్రధాన కార్యాలయం తదితర అన్ని విభాగాల్లోని అధికారులు, ఉద్యోగులు ఈ -ఆఫీస్ ఖాతాను కలిగి ఉండాలన్నారు. ఇప్పటికే ఖాతా ఉన్నవారు ఖాతాను యాక్టివేట్ చేసుకోవాలని, డిజిటల్ సంతకాలు సిద్ధం చేసుకోవాలని చెప్పారు. ఇకపై కార్యాలయంలో అన్ని రకాల దస్త్రాలు ఈ -ఆఫీస్ విధానంలోనే నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు నమోదు కోసం అందరూ రిజిస్టర్ కావాలని, యాప్‌లోనే అటెండెన్స్ వేయాలన్నారు. స్పందన ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో వచ్చే దరఖాస్తులను నిర్దేశించిన ఫార్మాట్‌లో పూర్తి చేయాలని ఆదేశించారు. స్పందన దరఖాస్తులు ఏ విభాగంలోనూ పెండింగ్ ఉండకూడదని, సకాలంలో పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. ఈ సమావేశంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎమ్‌హెచ్‌ఓ లోకేష్, ఎంఈ ధనలక్ష్మి, ఏసీపీ రామకృష్ణుడు, మేనేజర్ ఉమామహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యమే లక్ష్యం



కృష్ణాపురంలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య బృందం

ఐరాల: గ్రామీణ పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందిచడమే ఫ్యామిలీ డాక్టర్ లక్ష్యమని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రియాంక తెలిపారు. బుధవారం మండలంలోని కృష్ణాపురం సచివాలయంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ప్రియాంక సుమారు 110 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. నెలలో రెండురోజులు సచివాలయానికి వైద్య బృందంతో వస్తామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం గర్భిణులకు మధుమేహం, బీపీ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్, హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యంరెడ్డి, ఏఎన్‌ఎం చాముండీశ్వరి, ఎంఎల్‌హెచ్‌పీ జోత్స్న పాల్గొన్నారు.

సస్యరక్షణతో వరిలో జింకు లోపం నివారణ



వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ ప్రవీణ్

తవణంపల్లె: రైతులు సస్యరక్షణ చర్యలు చేపడితే వరిపంటలో జింకు లోపం నివారించవచ్చని ఏఓ ప్రవీణ్ తెలిపారు. బుధవారం మండలంలోని టీ.పుత్తూరు, దిగువమోదలపల్లె గ్రామాల్లో సాగు చేసిన వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ కొత్తగా సాగులోకి వచ్చిన నేలల్లో భాస్వరం ఎరువును ఎక్కువగా వాడితే జింకు లోపం వస్తుందన్నారు. జింకులోపంతో పంట ఎదుగుదల ఉండదని తెలిపారు. దీని నివారణకు రైతులు ఆఖరి దుక్కిలో ఎకరాకు 10 నుంచి 12 కిలోల వరకు జింకు సల్ఫేట్ వేసుకోవాలని చెప్పారు. 30 రోజులు పైబడిన పంటకు జింకు నైట్రేట్ రెండు గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు.

మసీదుకు దారి కల్పించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న ముస్లింలు

బంగారుపాళెం: మండలంలోని తుంబకుప్పంలో ఉన్న మసీదుకు దారి కల్పించాలని కోరుతూ బుధవారం ముస్లిం సంఘం నాయకులు తహసీల్దార్ బెన్నురాజ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా వక్ఫ్‌బోర్డు కార్యదర్శి ఫిరోజ్‌మహ్మద్, నాయకులు హిద్దు, షంషీర్ మాట్లాడుతూ గ్రామంలో 1992లో మసీదు నిర్మాణం జరిగిందన్నారు. అప్పటి నుంచి గ్రామానికి చెందిన ముస్లింలు మసీదుకు వెళ్లి ప్రార్థనలు చేసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మసీదుకు వెళ్లే దారిని మూసివేశారన్నారు. దారి మూసివేసిన వ్యక్తిపై చర్యలు తీసుకుని, రోడ్డు వసతి కల్పించాలని ఎంపీపీ అమరావతి, సీఐ నరసింహారెడ్డికి వినతిపత్రాలు సమర్పించామన్నారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ మాట్లాడుతూ విచారణ జరిపి మసీదుకు దారి కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో అరుణామల్‌రెడ్డి, పాలాక్షిరెడ్డి, మసీదు మతవల్లి మస్తాన్, హజరత్ మీరా పాల్గొన్నారు.

'ఫ్యామిలీ ఫిజీషియన్'ను సద్వినియోగం చేసుకోవాలి



ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్న వైద్యులు

యాదమరి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఫ్యామిలీ ఫిజీయన్ కార్యక్రమాన్ని గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని యాదమరి మండల వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్ కోరారు. బుధవారం మండలంలోని దాసరాపల్లె సచివాలయంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించి, గ్రామీణ ప్రజలకు చికిత్సలు చేశారు. అనంతరం వైద్యాధికారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం పేరుతో వైద్యసేవలు మీ ఇంటి వద్దనే అందుతున్నాయని తెలిపారు. హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రతి నెలా రెండో బుధవారం మీ గ్రామానికి వైద్యబృందం వచ్చి, చికిత్సలు అందిస్తుందని తెలిపారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

చిత్తూరు కార్పొరేషన్: హమాలీ కార్మికుల కోసం ప్రభుత్వం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రవి కోరారు. బుధవారం ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పలు రంగాల్లో పని చేస్తున్న హమాలీలకు జీవనాధారం కష్టంగా మారిందన్నారు. ఈ క్రమంలో హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాల్సిన అవశ్యకత ఉందన్నారు. ఈనెల 29, 30, 31 వరకు తిరుపతిలో జరిగే మహాసభల్లో హమాలీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్, నాయకులు రమాదేవి పాల్గొన్నారు.

క్రీడాసామగ్రి వితరణ



రాగిమానుపెంట ఉన్నత పాఠశాలకు క్రీడా సామగ్రిని అందజేస్తున్న దాత సుజాత

బంగారుపాళెం: మండలంలోని ఎగువరాగిమానుపెంట జెడ్పీ ఉన్నత పాఠశాలకు బుధవారం దాత క్రీడా సామగ్రి వితరణ చేశారు. గంగవరం మండలం నెడిగుంట జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం సుజాత ఎగువరాగిమానుపెంట పాఠశాలకు బాల్‌బ్యాడ్మింటన్ బ్యాట్లు, బాల్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఎగువరాగిమానుపెంట హైస్కూలు హెచ్‌ఎం సుజాత మాట్లాడుతూ గతంలో దాత సుజాత ఈ పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయురాలిగా పని చేస్తూ ఉద్యోగోన్నతిపై బదిలీ అయ్యారని చెప్పారు. తాను పనిచేసిన పాఠశాలలో క్రీడాకారులకు క్రీడా పరికరాలు అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు గురుప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అత్యవసర విభాగం కిటకిట



రోగులతో నిండిన అత్యవసర విభాగం

చిత్తూరు రూరల్: నగరంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రి అత్యవసర విభాగం బుధవారం సాయంత్రం కిటకిటలాడింది. పలు సమస్యలతో అత్యవసర వైద్యం కోసం ఆస్పత్రికి తరలివచ్చారు. దీంతో పూర్తిగా బెడ్లు రోగులతో నిండిపోయాయి. కొంత మంది డాక్టర్ల వద్ద క్యూకట్టారు. ఇలా ఆ విభాగం నిండిపోయింది. అక్కడి సిబ్బంది, డాక్టర్లు వైద్య సేవలో బిజీబిజీగా కనిపించారు.

సమష్టి కృషితో మండల అభివృద్ధి

పెనుమూరు(కార్వేటినగరం) : అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా పనిచేయాలని ఎంపీపీ హేమలతారెడ్డి అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల సర్వ సభ్యసమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రజాప్రతిని ధులు తెలిపిన సమస్యలను అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు మాట్లాడుతూ అటవీశాఖ అధికారులు, ఎక్సైజ్ అధికారులు సమావేశాలకు హాజరు కావడం లేదని, వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీడీవో శివయ్య మాట్లాడుతూ పెనుమూరు అంబేడ్కర్ కాలనీ లేఅవుట్‌లో మౌలిక వసతులు కల్పించి, త్వరితగతిన బిల్లులు మంజూరు చేస్తామని తెలిపారు. ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు దొరస్వామి, వైస్ ఎంపీపీలు కోదండ, దూది అరుణ, సింగిల్ విండో అధ్యక్షుడు కారేటి గోవిందరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు యశోద పాల్గొన్నారు.

జల్లికట్టు నిషేధం

గంగవరం: సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలో ఎవరైనా జల్లికట్టు, మైలేరు, కోడిపందాలు, జూదం వంటివి నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ అశోక్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం రాత్రి ఆయన మండలంలోని కీలపట్ల గ్రామ ప్రజలకు ఎస్ఐ సుధాకర్‌రెడ్డితో కలిసి అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో మైలేరు, జల్లికట్టు, కోడిపందేలు, నిర్వహణపై నిషేధం ఉందని తెలిపారు. సంక్రాంతి పండుగను ప్రజలందరూ సంప్రదాయబద్ధంగా సంతోషంగా జరుపుకోవాలని, జల్లికట్టు, మైలేరు లాంటివి నిర్వహించి అనవసరంగా ప్రాణాలమీదకు తెచ్చుకోవద్దన్నారు. ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించి ఎవరైనా నిర్వహించినట్టు తమ దృష్టికి వస్తే ఎంతటి వారైనా సరే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

పథకాలతో ఆర్థికంగా నిలబడ్డాం



కొత్తపల్లెలో లబ్ధిదారులకు పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

ఐరాల: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూడున్నరేళ్లుగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో తామంతా ఆర్థికంగా నిలదొక్కుకున్నామని పలు కుటుంబాల ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. 30 ఏళ్లలో ఏ ప్రభుత్వమూ ఇన్ని పథకాలు అమలు చేసిన దాఖలాలు లేవని తెలిపారు. ఒక్కొక్క కుటుంబానికి రూ.లక్షకుపైగా పథకాల ద్వారా లబ్ధి చేకూరిందని, ఆర్థికంగా ఎంతో వెసులుబాటు లభించిందన్నారు. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని, ఈ పథకాలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం ఎమ్మెల్యే ఎంఎస్ బాబు మండలంలోని చినకాంపల్లె సచివాలయ పరిధిలోని 45 కొత్తపల్లె, 45 కొత్తపల్లె దళితవాడ, ఎస్టీ కాలనీ, అడపగుండ్లపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. 390 కుటుంబాలను ఆయన పలకరించి, సంక్షేమ బావుటా బుక్‌లెట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎంఎస్ బాబు మాట్లాడుతూ పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డిదే అన్నారు. అడపగుండ్లపల్లె గ్రామస్తులు తారు రోడ్డు వేయాలని ఎమ్మెల్యేను కోరారు. సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ మోహన్, పార్టీ మండల కన్వీనర్ బుజ్జిరెడ్డి, సర్పంచులు శాంతిసాగర్‌రెడ్డి, రఘు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు దేవేంద్రరెడ్డి, మండల యువత విభాగం కన్వీనర్ భార్గవ్‌రెడ్డి, ఏఎంసీ మెంబర్ రామచంద్ర, మండల ఎస్సీ సెల్ ప్రధానకార్యదర్శి రాము, పార్టీ నేతలు చలపతిరెడ్డి, రవిచంద్రరెడ్డి, ఓబుల్‌రెడ్డి, చంద్రరెడ్డి, సురేష్‌రెడ్డి, ధనంజయ, దొరబాబు, రాజేష్‌రెడ్డి, భరత్ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి



గృహ నిర్మాణాల పరిశీలనలో కలెక్టర్ హరినారాయణన్

చిత్తూరు అర్బన్: నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా జగనన్న హౌసింగ్ లే అవుట్‌లలో గృహ నిర్మాణాలు వేగం పుంజుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ చిత్తూరు మున్సిపల్ కమిషనర్, గృహ నిర్మాణశాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన చిత్తూరు నగర పరిధిలోని తిమ్మ సముద్రం, అనుప్పల్లె, బండ్లపల్లె, తేనెబండ హౌసింగ్ లే అవుట్లను పరిశీలించి మాట్లాడారు. పేదవాడికి సొంతింటి కలను సాకారం చేసే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గృహ నిర్మాణాలు చేపట్టిందన్నారు. ఇళ్ల నిర్మాణాల్లో ప్రతివారం కచ్చితంగా దశల వారీ స్టేజ్ కన్వర్షన్ జరగాలని సూచించారు. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి, కేటాయించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. ఇంటి నిర్మాణాలకు సం బంధించి అవసరమైన వారందరికీ ఎస్‌హెచ్‌జీల ద్వారా రుణాలు ఇప్పించాలన్నారు. గృహ నిర్మాణాల వేగవంతం చేసేలా డీఆర్‌డీఏ ఏపీఎం, ఆర్పీలు సమన్వయంగా కృషి చేయాలన్నారు. ఈ పరిశీలనలో కమిషనర్ అరుణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆపరేషన్ వికటించిందని ఫిర్యాదు

చిత్తూరు రూరల్: విరిగిన కాలుకు చేసిన ఆపరేషన్ వికటించిందని యాదమరి మండలం దళవాయిపల్లెకు చెందిన గిరి అనే వ్యక్తి ఆస్పత్రి అధికారులకు ఫిర్యాదు చేశాడు. అతడి కథనం మేరకు.. దళవాయి పల్లె దళితవాడ గ్రామానికి చెందిన పుష్ప ఈ నెల 3వ తేదీన తలుపు పట్టుకుని పైకి లేచేందుకు ప్రయత్నించింది. ఈ క్రమంలో కింద పడడంతో కాలు విరిగింది. దీంతో ఆమెను చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. బయట 2డీ ఎక్స్‌రే తీయించారు. బుధవారం ఆపరేషన్ చేస్తే వికటించిందని, కుట్లు వేసి వేరే ఆస్పత్రికి తీసుకెళ్లాలని డాక్టర్లు సూచించారు. కాగా డాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా ఆపరేషన్ వికటించిందని ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్‌కు పుష్ప కుమారుడు గిరి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు విచారణ చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పకడ్బందీగా డ్రైనేజీ వ్యవస్థ నిర్వహణ

చిత్తూరు అర్బన్: నగరంలో డ్రైనేజీ వ్యవస్థను పకడ్బందీగా నిర్వహించాలని నగర కమిషనర్ జె అరుణ ఇంజినీరింగ్, ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం కమిషనర్ 42వ వార్డులో విస్తృతంగా పర్యటించారు. వార్డు పరిధిలో వన్నియర్ బ్లాక్, బుచ్చిశెట్టి వీధి, డీఐ రోడ్, గురప్ప నాయుడు వీధుల్లో మురుగునీటి కాలువలు, కల్వర్టులను కమిషనర్ అరుణ పరిశీలించారు. కాలువల్లో వ్యర్థాలను పూర్తిస్థాయిలో తొలగించడం, కల్వర్టు మరమ్మతులు, ఇతర పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. మురుగు కాలువలో నీటి ప్రవాహం స్తంభించకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని చెప్పారు. అన్ని వార్డుల్లో పైప్‌లైన్ ద్వారా సరఫరా చేసే నీటికి క్లోరినేషన్ పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని అమినిటి కార్యదర్శులను ఆదేశించారు.అనంతరం వార్డులో పారిశుద్ధ్య కార్యక్రమాలను తనిఖీ చేశారు. తడి, పొడి చెత్త సేకరణ విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడారు. స్థానిక సమస్యల పరిష్కారంపై కార్పొరేటర్ శశి కుమార్‌తో చర్చించారు. రోజువారీ విధుల నిర్వహణపై వార్డు కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎమ్‌హెచ్‌ఓ లోకేష్, ఎంఈ ధనలక్ష్మి, డీఈ వెంకట ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లోకనాథం పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



ఎమ్మార్సీ భవనం వద్ద రూటా నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ రుక్మిణి

యాదమరి: మండలంలోని ఎమ్మార్సీలో రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్(రూటా) నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంఈఓ రుక్మిణి ఆవిష్కరించారు. బుధవారం సాయంత్రం ఎమ్మార్సీ భవనం వద్ద ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ ఉపాధ్యాయులు నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంఈఓతో ఆవిష్కరించారు. ఎంఈఓ మాట్లాడుతు మండల పరిధిలోని ఉర్దూ పాఠశాలలను బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో 14 కండ్రిగ ముస్లింవాడ ఉర్దూ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం భాస్కర్ రావు, రూటా మండల అధ్యక్షుడు మహమ్మద్ గఫూర్, ఎస్టీయూ నాయకులు వాసు, జగదీష్, మధు, అబ్దుల్ రజాక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబించాలి

బంగారుపాళెం: వ్యవసాయంలో రైతులు ప్రకృతి సాగు పద్ధతులను అవలంబించాలని ఏఓ పద్మజ అన్నారు. మండలంలోని దండువారిపల్లెలో రైతు జగదీష్‌రెడ్డి ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన మిరప పంటను బుధవారం ఏఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి, సేంద్రియ వ్యవసాయ పద్ధతుల ద్వారా ఆరోగ్యకరమైన పంట దిగుబడి సాధించవచ్చన్నారు. రైతు జగదీష్ రెడ్డి మాట్లాడుతూ ఎకరా దుక్కిలో ఘన జీవా మృతం 400 కిలోలు, వేప పిండి 50 కిలోలు వేసుకోవాలన్నారు. బీజామృతంలో మిరప నారు తడిపి నాటినట్లు చెప్పారు. 15 రోజులకు ఒక్కసారి ద్రవ జీవామృతం, నీమాస్త్రం పిచికారి చేసుకుంటే మొక్క లు ఆరోగ్యంగా, దృఢంగా పెరుగుతాయన్నారు. పంటకు చీడపీడల తాకిడి నుంచి రక్షణ ఉంటుందన్నారు. ఆకు ముడుత, రసం పీల్చే పురుగుల నుంచి ఎదురయ్యే సమస్యకు మిరపతోటలో పసుపు, నీలం రంగు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా నివారించుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సాదరయ్య, వీఏఏ శిరీష పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత

శాంతిపురం: ప్రజా సంక్షేమంతో పాటు ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న రాష్ట్రప్రభుత్వం వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు పూర్తి ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్సీ భరత్ చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సొన్నేగానిపల్లి పంచాయతీలోని గుండిశెట్టిపల్లిలో ఆయన ఇంటింటికీ వెళ్లారు. అందుతున్న పథకాలను అడిగి తెలుసుకుని సంక్షేమ బావుటా బుక్‌లెట్లను అందజేశారు. ఇతర సమస్యలపై ఆరా తీసి తక్షణ పరిష్కారం కోసం అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రజల కష్టాలను తీర్చేందుకు అనేక కొత్త పథకాలను తీసుకువచ్చారని చెప్పారు. దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి తెచ్చిన ఆరోగ్యశ్రీ, 108, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటివి దేశానికి ఆదర్శంగా నిలిస్తే ఇప్పుడు నాడు-నేడు, అమ్మఒడి, గోరుముద్ద, చేదోడు, వసతి దీవెన, సచివాలయ వ్యవస్థ, ఆర్బీకేలు వంటి అనేక పథకాలను తెచ్చారన్నారు. రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాలు-వలంటీరు వ్యవస్థ, నాడు-నేడు పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని చెప్పారు. ప్రతి కుటుంబంలోని వారి కష్టాలు, అవసరాలను గుర్తించి వాటి పరిష్కారానికి సీఎం స్థాయిలోనే పథకాల రూపకల్పన సాగుతోందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆదరించి మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, ఎంపీపీ వసుంధర, రాష్ట్ర కార్పొరేషన్ల డైరెక్టర్లు చంగప్ప, కృష్ణమూర్తి, నాగభూషణమ్మ, సుకుమార్, శ్రీనివాసమూర్తి, నాయకులు కోదండరెడ్డి, చక్రపాణిరెడ్డి, విజయకుమార్, ప్రభాకరరెడ్డి, లోకనాథరెడ్డి, నిసార్, అయ్యప్పరెడ్డి, మునిరత్నం గౌడు, దేవేంద్రప్ప, అశ్వత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.